# సాక్షి మహబూబాబాద్

గురువారం । 6 । మార్చి । 2025






### డిగ్రీ ఫలితాల నిలిపివేత

కేయూ అకాడమిక్ డీన్‌కు ఫీజు చెల్లించకపోవడంతో 121 ప్రైవేట్ డిగ్రీ కళాశాలల పరీక్ష ఫలితాలను అధికారులు నిలిపివేశారు.

- 8లో ▸



### నకిలీ పురుగు మందులు..

నకిలీ పురుగు మందులు విక్రయిస్తున్న ముఠాను బుధవారం అరెస్టు చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు.

- 8లో ▸

### వాతావరణం

గరిష్టం/కనిష్టం
$34^0/16^0$

జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రతతో వేడిగాలులు వీస్తాయి. రాత్రి కాస్త చల్లగా ఉంటుంది.

### రంజాన్ వేళలు

| ఇఫ్తార్ | సహర్ |
|---|---|
| గురు 6:29 | శుక్ర 5:08 |

## న్యూస్‌రీల్

### తాగునీటి కొరత రాకుండా చూడాలి



గూడూరు: రానున్న వేసవిలో తాగునీటి కొరత ఏర్పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓ పురుషోత్తం అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మిషన్ భగీరథ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులతో బుధవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో ప్రజలు నీటి అవసరాలకు ఇబ్బందులు ఎదుర్కోకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని చెప్పారు. ప్రభుత్వం నిరుపేదలకు అందించే ఇందిరమ్మ ఇళ్ల మంజూరీ విషయంలో ఎలాంటి పొరపాట్లు జరుగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వీరస్వామి, ఎంపీఓ సత్యనారాయణ, మిషన్ భగీరథ అధికారులు పాల్గొన్నారు.

### పోక్సో, అట్రాసిటి కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్ : జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన యువకుడిపై పోలీసులు పోక్సో, ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. మైనరు బాలికకు మాయమాటలు చెప్పి మోసం చేసి లోబరుచుకుని గర్భవతిని చేసిన ఘటనలో సదరు యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిసింది.

### టీఎన్జీఓ డైరీ ఆవిష్కరణ



మహబూబాబాద్ అర్బన్: టీఎన్జీఓ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వడ్డెబోయిన శ్రీనివాస్ అధ్యక్షతన 2025 సంవత్సరం నూతన క్యాలెండర్, డైరీని కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరబ్రహ్మాచారి, రాష్ట్ర ఈసీ సభ్యుడు నాగబ్రహ్మాచారీ, అసోసియేట్ అధ్యక్షుడు సునిల్, కోశాధికారి రోహిత్, రంజిత్, సురేష్, రమ్య, ప్రధాన కార్యదర్శి సుభద్ర, యాకూబ్, టీజీఓ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ రఫీ, ప్రసాద్, రాజశేఖర్, రాము, తదితరులు పాల్గొన్నారు.

### మహిళా దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

మహబూబాబాద్ అర్బన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పోస్టర్‌ను కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ బుధవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగల సెంట్రల్ అసోసియేషన్, జిల్లా శాఖ ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులకు పలు క్రీడా పోటీలు నిర్వహించారు. నేడు, రేపు(6, 7వ తేదీల్లో) క్రీడా పోటీల నిర్వహించి, 8న బహుమతులు ప్రదానం చేయనున్నారు. కార్యక్రమంలో కృష్ణవేణి, నిలోఫర్, ధనమ్మ, ప్రయదర్శని, తదితరులు పాల్గొన్నారు.

### ఎక్సైజ్ వాహనాల వేలం



మహబూబాబాద్ రూరల్ : నిషేధిత నల్ల బెల్లం, గుడుంబా రవాణా చేస్తూ జిల్లా పరిధిలో పట్టుబడిన వాహనాలకు ఎక్సైజ్ స్టేషన్‌లో బుధవారం వేలం నిర్వహించారు. ఈ వేలంలో వివిధ ప్రాంతాల నుంచి 341 మంది పాల్గొన్నారు. మొత్తం 88 వాహనాల్లో 86 వాహనాలకు జిల్లా ఎక్సైజ్ అధికారి బి.కిరణ్ సమక్షంలో వేలం నిర్వహించారు. 86 వాహనాలకు రూ.19,69,000 తోపాటు, జీఎస్టీ రూపంలో రూ.2,73,480 కలిపి మొత్తం రూ.22,42,480 ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ చిరంజీవి, ఎస్సైలు మౌనిక, రవికుమార్, అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

# ఉపాధి కూలీల యాప్

## జన్‌మన్‌రేగా రూపొందించిన కేంద్రం

- గతంలో మొబైల్ మానిటరింగ్ సిస్టం
- ప్రస్తుత యాప్‌లో కూలీల పూర్తి వివరాలు
- ఫిర్యాదులకు అవకాశం



మహబూబాబాద్ అర్బన్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీల హాజరు కోసం ఇప్పటివరకు అమల్లో ఉన్న మాన్యువల్ హాజరుకు చెక్ పెడుతూ.. ఆన్‌లైన్ హాజరు కోసం కేంద్ర ప్రభుత్వం మొబైల్ మానిటరింగ్ సిస్టం (ఎన్ఎంఎంఎస్) యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. దీంతోపాటు ప్రస్తుతం జన్‌మన్‌రేగా యాప్‌ను కూడా అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ యాప్‌తో ఉపాధి హామీలో ఉన్న కూలీందరికి ఏడాదికి వంద రోజుల పని కల్పిస్తున్నారా.. అనే విషయాన్ని సులభంగా తెలుసుకోవచ్చు. ఒకటికంటే ఎక్కువ బ్యాంకు ఖాతాలు ఉన్నవారికి ఏ ఖాతాలోడబ్బులు జమ చేశారో తెలుసుకోవడం కోసం కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన జన్‌మన్‌రేగా యాప్ ఉపయోగపడనుంది. ఈ యాప్ ద్వారా ఎవరెవరు ఎన్ని రోజులు పనిచేశారు.. అధికారులు ఎవరికి ఎన్ని పనిదినాలు కల్పించారు.. ఎంత మొత్తంలో లబ్ధిదారుల ఖాతాలో జమ అయింది వంటి పూర్తి సమాచారం జన్‌మన్‌రేగా యాప్‌లో తెలుసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది.

**యాప్ ఉపయోగించడం ఇలా..**

జన్‌మన్‌రేగా యాప్‌ను ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్‌లో ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. అందులో కూలీల వేతనాలు, పని దినాలకు సంబంధించిన ఐచ్ఛికాన్ని ఎంపిక చేయాలి. రాష్ట్రం, జిల్లా, మండలం, పంచాయతీ, కుటుంబ ఐడీ వివరాలు నమోదు చేయాలి. పేమెంట్ ఐచ్ఛికానికి వెళ్లి ఉపాధి హామీలో పని చేస్తున్న వ్యక్తి పేరు మీద ఎంపిక చేస్తే ఎక్కడ పనిచేశారు.. పని సంఖ్య.. తదితర వివరాలతోపాటు వేతనాలు ఎప్పుడు ఎంత జమచేశారు. ఏ బ్యాంకులో ఎంత జమ చేశారో.. తెలుస్తుంది. కూలీ డబ్బులు జమకాకపోతే కారణాలు కూడా స్పష్టంగా కనిపిస్తాయి. మరోవైపు పథకంలో చేపట్టే పనులు సమాచారం స్థానిక అక్రమాలపై ఫిర్యాదులకు కూడా అవకాశం కల్పించారు. యాప్‌లో వివిధ భాషల్లో వివరాలు ఉంటాయి. అదేవిధంగా లబ్ధిదారు ఖాతాకు ఆధార్ లింకు అయిందా..? ఆధార్‌లో పోలిన విధంగా బ్యాంకు వివరాలు ఉన్నాయా..? ఏబీపీఎస్ ఆధార్ బ్రిడ్జి పేమెంట్ సిస్టం లింక్ అయిందా.. అనే వివరాలు ఈ యాప్‌లో ఉంటాయి. ఒకవేళ అన్నిటికి లింకైతే పచ్చ రంగుల్లో రైట్ గుర్తు లేకుంటే దేనికి కాలేదో అక్కడ ఎర్ర రంగులో తప్పు గుర్తు కనిపిస్తుంది. జాబ్‌కార్డులో కుటుంబ సభ్యులు ఎవరెవరు ఈ ఆర్థిక సంవత్సరంలో ఎన్ని రోజులు పని చేశారనే వివరాలు కూడా యాప్‌లో చూడొచ్చు.

**జిల్లాలో జాబ్‌కార్డులు, కూలీల వివరాలు**

| | |
|---|---|
| మండలాలు | 16 |
| జాబ్‌కార్డులు | 2,00,151 |
| మహిళలు | 1,33,915 |
| పురుషులు | 1,21,925 |
| మొత్తం కూలీలు | 2,55,840 |



జన్‌మన్‌రేగా యాప్

**కూలీలకు ఇబ్బందులు తప్పుతాయి..**



జిల్లాలో ఉపాధిహామీలో పనిచేస్తున్న వారు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జన్‌మన్‌రేగా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. దీంతో పూర్తి వివరాలు తెలుస్తాయి. అక్రమాలపై కూడా ఫిర్యాదు చేయొచ్చు. ఈజీఎస్‌కు సంబంధించి ఎలాంటి అవసరం ఉన్నా.. యాప్‌లో చూసుకోవచ్చు. దీని ద్వారా కూలీలకు ఇబ్బందులు తప్పుతాయి. - మధుసూదన్‌రాజ్, డీఆర్‌డీపీ

జిల్లా కేంద్రంలోని పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల సందడి



# ఇంటర్ పరీక్షలు షురూ..

- సెంటర్లను తనిఖీ చేసిన కలెక్టర్, డీఐఈఓ
- 4,673 మందికి 4,246 మంది హాజరు

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో బుధవారం ప్రారంభమైన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా సాగాయి. తెలుగు, ఉర్దూ, హిందీ, సంస్కృతం పరీక్షలకు 3,394 మంది విద్యార్థులకు 3,293 మంది హాజరు కాగా 101 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 1,279 మందికి 1,133 మంది హాజరుకాగా 146 మంది గైర్హాజరయ్యారు.

**మొక్కుబడిగా సీసీ కెమెరాలు**

అన్ని పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా.. అందులో సెంటర్‌కు 1, 2 మాత్రమే రికార్డు అవుతున్నట్లు చూపించగా మిగతావి మాత్రం పని చేయకపోవడం గమనార్హం. సీసీ కెమెరాల నడుమ విద్యార్థుల పరీక్ష తీరును పర్యవేక్షించాలి. కాగా, అధికారులు చెప్పినప్పటికీ పని చేయని సీసీ కెమెరాలతో తూతూ మంత్రంగా పరీక్షలు నిర్వహించారని ఆరోపణలు వచ్చాయి.

**ఆలస్యంగా వచ్చిన విద్యార్థులకు నో ఎంట్రీ**

మానుకోట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష రాసేందుకు ఒకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థి (ఎంపీహెచ్) ఉదయం 09:20 గంటలకు పరీక్షా కేంద్రానికి చేరుకున్నాడు. ఆలస్యమైందని అనుమతి లేదని విషయాన్ని తెలుసుకున్న విద్యార్థి వెనుదిరిగి వెళ్లాడు. ప్రభుత్వ బాలికల కళాశాల పరీక్ష కేంద్రానికి ఓ విద్యార్థిని సైతం ఆలస్యంగా వచ్చింది. అక్కడ ఉన్న అధికారులు, సిబ్బంది అనుమతి లేదని చెప్పడంతో వెళ్లిపోయింది.

**కలెక్టర్, డీఐఈఓ తనిఖీ**

మానుకోట మున్సిపల్ పరిధిలోని అనంతారం మోడల్ స్కూల్ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలను డీఐఈఓ మదార్ గౌడ్ తనిఖీ చేశారు. కళాశాలలో పరీక్ష చీఫ్ సూపరింటెండెంట్‌ను ఏమైనా సమస్యలు ఉన్నాయా.. అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు పరీక్ష రాసిన తీరును, వారి ప్రశ్న, జవాబు పత్రాలను పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు గురించి అడిగి తెలుసుకున్నారు. టౌన్ సీఐ దేవేందర్, ఎస్సై దీపిక బందోబస్తు నిర్వహించారు. జిల్లా పరీక్షల నియంత్రణ అధికారులు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో తనిఖీ చేశారు. బయ్యారం, గార్ల, డోర్నకల్‌లో ఉన్న పరీక్షా కేంద్రాలను తనిఖీలు చేసి ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షల్లో ఎలాంటి లోపాలు రాకూడదని సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లకు సూచించారు.

**పరీక్ష కేంద్రాల వద్ద వైద్యశిబిరాలు...**

జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఇంటర్ పరీక్ష కేంద్రాల్లో కలెక్టర్ ఆదేశాల మేరకు వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఎలాంటి అస్వస్థతకు గురైనా వెంటనే స్పందించేందుకు వీలుగా వైద్యసిబ్బంది, ఏఎన్ఎం అందుబాటులో ఉన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడిసిన్ సిద్ధంగా ఉంచారు.



పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది



అనంతారం మోడల్ స్కూల్‌లో పరీక్ష నిర్వహణను పరిశీలిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

**విద్యార్థిని పరీక్ష కేంద్రానికి చేర్చిన సీఐ**

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షల కేంద్రం ఏర్పాటు చేశారు. పరీక్ష సమ యం దగ్గరపడిన తర్వాత అక్కడకు వచ్చిన ఓ విద్యార్థి తనకు కేటాయించిన సెంటర్ అదికాదని గుర్తించి అయోమయంలో పడ్డాడు. అదేసమయంలో అక్కడకు వచ్చిన టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ సదరు విద్యార్థిని వివరాలు అడిగి తెలుసుకొని కేసముద్రం రోడ్డులో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల కేంద్రం వద్దకు పరీక్ష సమయానికి ఐదు నిమిషాల ముందు చేర్చారు. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది.





పోలీసు వాహనంలో విద్యార్థిని తీసుకెళ్తున్న సీఐ

# పిల్లల చదువులపై దృష్టి సారించాలి

- అదనపు కలెక్టర్ లెనిన్ ఉత్సవ్ టొప్పో

డోర్నకల్: పిల్లల చదువులపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని, ఇందుకోసం ప్రతిరోజూ కొంత సమయం కేటాయించాలని అదనపు కలెక్టర్ లెనిన్ ఉత్సవ్ టొప్పో సూచించారు. స్థానిక పీఎం శ్రీ జెడ్పీహెచ్‌ఎస్‌లో నూతనంగా నిర్మించిన సైన్స్ ల్యాబ్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ తిలకించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, డోర్నకల్ శాఖ అందించిన 10 సైకిళ్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవంలో పాల్గొన్న అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ.. పాఠశాలల్లో ఉపాధ్యాయులు.. విద్యార్థుల చదువుతోపాటు అభ్యసన శక్తిని నిత్యం పరిశీలిస్తారని, ఇంటి వద్ద తల్లిదండ్రులు సైతం పిల్లల చదువులపై దృష్టి సారించాలని సూచించారు. చదవడం, పరిశీలించడం, ప్రశ్నించడం, అధ్యయనం, మెడిటేషన్ చేయడంపై విద్యార్థులు దృష్టి సారించాలని చెప్పారు. పీఎం శ్రీ జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం తోపాటు ఉపాధ్యాయులు ఉత్తమ ఫలితాలు, పాఠశాల అభివృద్ధి కోసం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు తమ సృజనాత్మకతను చాటుకున్నారని అన్నారు. త్వరలో పదో తరగతి వార్షిక పరీక్షలు రాసే విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. హెచ్ఎం బండి నర్సింహారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అంద్రు రవీందర్ రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి ఆంగోత్ లక్ష్మా నాయక్, ఎస్‌బీఐ మేనేజర్ సుధాకర్, ఉపాధ్యాయులు అప్పిరెడ్డి, సాహెబ్‌అలీ, జె.కమల తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేస్తున్న అడిషనల్ కలెక్టర్

# జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలి

- కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



విష్ణువర్ధన్‌ను అభినందిస్తున్న కలెక్టర్, డీఈఓ

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కష్టపడి చదివి జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. సైన్స్ ట్యాలెంట్ టెస్టులో రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం సాధించిన విష్ణువర్ధన్‌కు బుధవారం కలెక్టర్ షీల్డ్, ప్రశంస పత్రం అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విష్ణువర్ధన్ ట్యాలెంట్ టెస్టులో రాష్ట్రస్థాయిలో ప్రతిభచాటడం అభినందనీయమన్నారు. విష్ణువర్ధన్‌ను ఆదర్శంగా తీసుకొని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పలు రంగాల్లో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని సూచించారు. డీఈఓ రవీందర్‌రెడ్డి, సైన్స్ అధికారి అప్పారావు, ప్రధానోపాధ్యాయుడు సంకా బద్రీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులకు ఉద్యోగ అవకాశం కల్పించాలి

- అజయ్‌సారథిరెడ్డి

మహబూబాబాద్ రూరల్: మల్యాల జేవీఆర్ హెచ్ఆర్ఎస్ కేంద్రంలో పనిచేసి మరణించిన కుటుంబాల సభ్యుల్లో.. అర్హత ఉన్న స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశం కల్పించాలని కోరుతూ టైం స్కేల్ క్యాజువల్, కార్మికుల కుటుంబాల సభ్యులు మల్యాల ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ జె.చీనానాయక్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బి.అజయ్‌సారథిరెడ్డి మాట్లాడుతూ.. మల్యాలలో అనేక ఏళ్లుగా టైం స్కేల్, క్యాజువల్ కార్మికులుగా పనిచేసి చనిపోయిన కార్మిక కుటుంబాలు, స్థానికులను ఆదుకోవాలని కోరారు. నూతనంగా ఏర్పాటైన మల్యాల ఉద్యాన కళాశాలలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో జీఓ ఎంఎస్ నంబర్ 110 ప్రకారం కొండా లక్ష్మణ్ ఉద్యాన యూనివర్సిటీ పరిధిలోని సుమారు 79 పోస్టులు ఉన్నట్లు తెలిసిందన్నారు. వారికి తక్షణమే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, మల్యాల ఉద్యాన కళాశాలను తక్షణమే నిర్మాణం చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో షరీఫ్, పెరుగు కుమార్, తండా శ్రీనాథ్, నూకల సాయికిరణ్, బుర్ర నరేష్, గణేష్, సుమన్, ఉపేందర్, వెంకన్న, అలీ, కొమరమ్మ, వెంకన్న, శ్రీశైలం, ఖతేజా, యాకూబ్ పాషా, సలీమా, మధరమ్మ, మైబు, సర్వర్, ఖతీజ తదితరులు పాల్గొన్నారు.



ఏడీకి వినతిపత్రం ఇస్తున్న అజయ్ సారథిరెడ్డి, తదితరులు

# కేసముద్రం మార్కెట్‌లో మిర్చి రైతుల ఆందోళన

- కాంటాలు పెట్టకపోవడంతో ఆగ్రహం

కేసముద్రం: మార్కెట్‌కు అమ్మకానికి తీసుకొచ్చిన మిర్చికి.. వ్యాపారులు ఆలస్యంగా టెండర్లు వేయడంతో సాయంత్రం అయినప్పటికీ కాంటాలు మొదలు పెట్టలేదు. దీంతో ఆగ్రహించిన మిర్చి రైతులు ఆందోళనకు దిగారు. వివరాలిలా ఉన్నాయి.. కేసముద్రం మార్కెట్‌కు బుధవారం సుమారు 5వేల బస్తాల మిర్చి అమ్మకానికి వచ్చింది. ఈ నామ్ విధానం ద్వారా వ్యాపారులు టెండర్లు వేసి, మధ్యాహ్నం 1 గంటకు విన్నర్ లిస్టు విడుదల చేయాల్సి ఉంది. కానీ వ్యాపారులు టెండర్లు ఆలస్యంగా వేయడంతోపాటు, సాయంత్రం 4 గంటల సమయంలో విన్నర్ లిస్టును విడుదల చేశారు. దీంతో ఉదయం నుంచి మిర్చి ఘాటులో పడిగాపులు పడిన రైతులకు సాయంత్రమైనా మిర్చి ధరలను తెలుపకపోవడం, కాంటాలు పెట్టకపోవడంతో ఆగ్రహించి మార్కెట్ ఆఫీస్ వద్ద ఆందోళనకు దిగారు. ఒక పక్క ధరలు లేకపోగా, మరోవైపు ఖరీదు చేసిన మిర్చికి కాంటాలు పెట్టకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ అధికారులను నిలదీశారు. తూకాల్లో తమను మోసగించడం కోసమే వ్యాపారులు టెండర్లను ఆలస్యంగా వేశారంటూ రైతులు ఆరోపించారు. ఇప్పటికే ధర తగ్గించడంతోపాటు, బస్తాకు కేజీ చొప్పున మిర్చి కటింగ్ చేస్తూ, క్యాష్ కటింగ్ చేస్తూ తమను నిలువునా దోచుకుంటున్నారంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై మురళీధర్‌రాజు మార్కెట్‌కు చేరుకుని.. వ్యాపారులు, అధికారులతో మాట్లాడి.. రైతులకు నచ్చజెప్పారు. అనంతరం రాత్రి 7.30 గంటల సమయంలో మిర్చికి కాంటాలు ప్రారంభించారు. దీంతో అర్ధరాత్రి వరకు రైతులు మిర్చి యార్డులోనే ఇబ్బందులు పడాల్సి వచ్చింది.



మార్కెట్‌లో రైతులతో మాట్లాడుతున్న ఎస్సై

# లే అవుట్ల క్రమబద్ధీకరణపై రాయితీ

- కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

మహబూబాబాద్ అర్బన్: మార్చి 31వ తేదీ లోగా అనధికార లే అవుట్ల క్రమబద్ధీకరణ చేసుకుంటే 25 శాతం రాయితీ వర్తిస్తుందని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్ఆర్ఎస్ 2020 కింద దరఖాస్తులు వచ్చాయని సెప్టెంబర్ 2024లో జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం కొన్ని దరఖాస్తుల క్రమబద్ధీకరణ అయిందని, ఎల్ఆర్ఎస్ ప్రక్రియను సులభతరం చేసేందుకు ప్రభుత్వం కొన్ని నూతన నిర్ణయాలను తీసుకుందని తెలిపారు. ఎల్ఆర్ఎస్ ప్లాట్లు రిజిస్ట్రేషన్ సమయంలో రుసుం చెల్లించి క్రమబద్ధీకరణ చేసుకోవచ్చని, నూతన దరఖాస్తులు సేకరించి ఎల్ఆర్ఎస్ కోసం మున్సిపల్ శాఖకు వివరాలు పంపించి క్రమబద్ధీకరిస్తారన్నారు. 2020 సంవత్సరంలో రూ.1,000 చెల్లించి ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న వారి అర్జీల పరిశీలన ప్రారంభమైందన్నారు. ప్లాట్ రెగ్యులరైజ్ చేసుకునే వారికి, రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి వాల్యుయేషన్ ప్రకారం ఎల్ఆర్ఎస్‌లో దరఖాస్తు ఫీజు విధిస్తారని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లెలిన్ వత్సల టొప్పో, వీరబ్రహ్మాచారి, జెడ్పీ సీఈఓ పురుషోత్తం, డీపీఓ హరిప్రసాద్, జిల్లా టౌన్ ప్లానింగ్ అధికారి సాయికిరణ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

### అభ్యుదయ మహిళా రైతుల ఎంపిక

మహబూబాబాద్ రూరల్: ఉద్యాన పంటలు సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్న పలువురు మహిళలను అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అభ్యుదయ మహిళా రైతులుగా ఎంపిక చేశామని జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమల శాఖ అధికారి జినుగు మరియన్న బుధవారం తెలిపారు. మంగళంపల్లి నీలిమ (ఫతేపూర్), డాక్టర్ పాల్వాయి సౌజన్య (మహబూబాబాద్), బానోతు సుశీల (కాంపల్లి), మిట్టకోల విమల (హరిపిరాల), ఎక్కటి మధురమ్మ (చర్లపాలెం), వేమిశెట్టి లత (హరిపిరాల), బొల్లం మల్లికాంబ (మాటేడు), ముక్కావుల యాదమ్మ (గుంట్లకుంట), కొలిపాక ఉమ (నేరడ), నూకల కరుణామయి (చిల్లంచర్ల), మాదాసు ఉప్పలమ్మ (రాంపురం) పాము సరస్వతి (నెల్లికుదురు), కట్కూరి రేణమ్మ (కౌసల్యదేవిపల్లి)ను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.

# పురుగునివారణ చర్యలు చేపట్టాలి

- ఏడీఏ శ్రీనివాసరావు

గార్ల: యాసంగిలో సాగు చేసిన వరిపంటలో మొగి పురుగు, ఆకుచుట్టు పురుగు నివారణకు రైతులు చర్యలు చేపట్టాలని వ్యవసాయశాఖ ఏడీఏ శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి రామారావు రైతులకు సూచించారు. మండలంలోని గోపాలపురం శివారులో జాతీయ ఆహార భద్రతా పథకం క్లస్టర్ డెమోలో భాగంగా బుధవారం వారు వరిపంటను పరిశీలించారు. ఈ సందర్భంగా వరిపంట సాగు యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ కిరణ్ తో పాటు రైతులు పాల్గొన్నారు.



వరిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

# వేయిస్తంభాల దేవాలయ ఆదాయం రూ. 22,01,850

హన్మకొండ కల్చరల్: నగరంలోని వేయిస్తంభాల దేవాలయంలో బుధవారం ఉదయం ఫిబ్రవరి 25వ తేదీ నుంచి మార్చి ఒకటి వరకు జరిగిన మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాల హుండీ లెక్కింపు నిర్వహించారు. హుండీ ఆదాయం రూ.8,21,800, పూజా రుసుముల ద్వారా రూ.7,20,000, విరాళాలు రూ.6,60,000 మొత్తం ఆదాయం రూ.22,01,800 వచ్చినట్లు ఈఓ అనిల్‌కుమార్ తెలిపారు. లెక్కింపులో వరంగల్ దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత, దుర్గేశ్వరస్వామి ఆలయ ఈఓ ప్రసాద్ పర్యవేక్షకులుగా వ్యవహరించారు. గత ఏడాది కంటే రూ.6.50లక్షలు ఎక్కువ ఆదాయం వచ్చినట్లు ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు.

## ఆటోను ఓవర్‌ టేక్‌ చేయబోయి..

- స్కూటీని ఢీకొన్న బైక్‌
- తొమ్మిదో తరగతి విద్యార్థి మృతి


సాజిద్‌ (ఫైల్‌)

**నెక్కొండ:** బైక్‌.. ఆటోను ఓవర్‌ టేక్‌ చేయబోయి ఎదురుగా వస్తున్న స్కూటీని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఓ బాలుడు మృతి చెందాడు. ఈఘటన బుధవారం మండల కేంద్రంలో జరిగింది. ఎస్సై మహేందర్‌ కథనం ప్రకారం.. మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన చిన్నబోయిన సంతు మరొకరితో కలిసి బైక్‌పై నెక్కొండ నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. మోడల్‌ స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న నెక్కొండకు చెందిన మహ్మద్‌ సాజిద్‌ (16) స్కూటీపై నెక్కొండకు వస్తున్నాడు. ఈ క్రమంలో నెక్కొండ- అప్పల్‌రావుపేట ప్రధాన రహదారిపై మండల కేంద్రంలో ఆటోను ఓవర్‌ టేక్‌ చేయబోయిన సంతు..ఎదురుగా వస్తున్న సాజిద్‌ స్కూటీని ఢీకొన్నాడు. ఈ ఘటనలో సాజిద్‌, సంతుతోపాటు మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా సాజిద్‌ మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి మదార్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేందర్‌ పేర్కొన్నారు.

**మరియపురంలో బైక్‌ అదుపు తప్పి విద్యుత్‌ ఉద్యోగి..**


రమేశ్‌(ఫైల్‌)

**గీసుకొండ:** విధులకు వెళ్తున్న ఓ విద్యుత్‌ ఉద్యోగి బైక్‌ అదుపు తప్పడంతో మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని మరియపురంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. ములుగు జిల్లా మల్లంపల్లి మండలం రాంచంద్రాపురం గ్రామానికి చెందిన ఓరుగంటి రమేశ్‌(50) 12 సంవత్సరాల క్రితం గీసుకొండకు వలస వచ్చాడు. గీసుకొండ(కొనాయమాకుల) విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలో అన్‌మ్యాన్డ్‌ వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం ఊకల్‌ నుంచి ఓ విద్యుత్‌ వినియోగదారుడు ఫోన్‌ చేసి తమ గ్రామంలో కరెంట్‌ లేదని చెప్పాడు. దీంతో బైక్‌పై మరియపురం నుంచి ఊకల్‌వైపునకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ముందు ఉన్న సంచిలోని సామగ్రి హ్యాండిల్‌ను తిరగకుండా చేయడంతో బైక్‌ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న గోడను బలంగా ఢీకొంది. దీంతో రమేశ్‌ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, నలుగురు కుమారులు ఉన్నారు. కాగా, రమేశ్‌ మృతిపై ఏఈ సంపత్‌రెడ్డి, విద్యుత్‌ సిబ్బంది సంతాపం తెలిపారు.

## అజ్నీ ప్యాసింజర్‌ పునరుద్ధరణ..

- నేటి నుంచి పట్టాలెక్కనున్న రైలు
- కాజీపేట-బల్హార్షా ఎక్స్‌ప్రెస్‌గా మార్పు

**కాజీపేట రూరల్‌ :** కరోనా సమయంలో రద్దు చేసిన అజ్నీ ప్యాసింజర్‌ను పునరుద్ధరించారు. గురువారం నుంచి యథావిధిగా నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు బుధవారం తెలిపారు. ఈ నెల 6నుంచి కాజీపేట జంక్షన్‌ నుంచి ప్రతీ రోజు రాత్రి 10.50 గంటలకు బయలుదేరే కాజీపేట-బల్హార్షా (17035) ఎక్స్‌ప్రెస్‌ ఉదయం 3.50 గంటలకు బల్హార్షాకు చేరుతుంది. అదేవిధంగా బల్హార్షాలో ఈ నెల 7వ తేదీన ఉదయం 3.50 గంటలకు బయలుదేరే బల్హార్షా-కాజీపేట (17036) ఎక్స్‌ప్రెస్‌ కాజీపేటకు 8.50 గంటలకు చేరుతుంది. ఈఎక్స్‌ప్రెస్‌కు ఉప్పల్‌, జమ్మికుంట, ఓదెల, పెద్దపల్లి, రాఘవపురం, రామగుండం, మంచిర్యాల, మందమర్రి, బెల్లంపల్లి, రెచ్నిరోడ్‌, సిర్పూర్‌కాగజ్‌నగర్‌, వీరూర్‌, వీర్గం, మణిఘర్‌ రైల్వే స్టేషన్లలో హాల్టింగ్‌ కల్పించినట్లు కాజీపేట రైల్వేస్టేషన్‌ మేనేజర్‌ రవీందర్‌ తెలిపారు.

**నాటి అజ్నీ ప్యాసింజరే నేటి ఎక్స్‌ప్రెస్‌గా..**

గతంలో కాజీపేట-అజ్నీ-కాజీపేట మధ్య ప్రయాణించే ఈ ప్యాసింజర్‌ను కరోనా సమయంలో దక్షిణ మధ్య రైల్వే అధికారులు 2023, నవంబర్‌ 13వ తేదీన రద్దు చేశారు. దాదాపు 17 నెలల తర్వాత ప్రయాణికుల డిమాండ్‌ మేరకు ఈ అజ్నీ ప్యాసింజర్‌ను కాజీపేట-బల్హార్షా-కాజీ పేట మధ్య మెయిల్‌ డైలీ ఎక్స్‌ప్రెస్‌గా నడిపిస్తున్నట్లు అధికారులు తెలిపారు. చాలా కాలం తర్వాత ఈ రైలును ప్రవేశపెట్టడంతో కాజీపేట నుంచి బల్హార్షా మార్గంలో వెళ్లే ప్రయాణికులు, ఇతర వర్గాల వారికి సౌకర్యంగా ఉంటుంది. కాగా, ఈ రైలును పునరుద్ధరించడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# మా బంగారం ఇవ్వండి..

### ఎస్‌బీఐలో బాధితుల ఆందోళన

- చోరీకి గురైన బంగారం ఇవ్వాలని డిమాండ్‌
- లేదా ప్రస్తుతం గోల్డ్‌కు ఉన్న ధర ప్రకారం డబ్బు చెల్లించాలి
- తరుగు తీసి డబ్బు చెల్లిస్తామంటే తీసుకోబోమని స్పష్టీకరణ
- గత సంవత్సరం బ్యాంకులో 19 కిలోల పసిడి చోరీ
- పరిహారం ఇవ్వడానికి ఖాతాదారులను పిలిచిన అధికారులు


బ్యాంకు అధికారులను నిలదీస్తున్న బాధితులు

**రాయపర్తి:** చోరీకి గురైన బంగారం ఇవ్వండి.. లేదంటే ప్రస్తుతం మార్కెట్‌లో తులం గోల్డ్‌కు ఉన్న ధర ప్రకారం డబ్బు ఇవ్వాలి.. తరుగు తీసి డబ్బు చెల్లిస్తామంటే తీసుకోబోమని బంగారం బాధితులు స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం రాయపర్తి మండల కేంద్రంలోని ఎస్‌బీఐలో ఆందోళన చేపట్టారు. కాగా, 2024 నవంబర్‌ 18న బ్యాంకులో 497 మందికి సంబంధించిన 19 కిలోల బంగారు ఆభరణాలను చోరీకి గురైన విషయం విదితమే. ఈ ఘటనలో బాధితులకు పరిహారం ఇవ్వడానికి అధికారులు.. బాధితులను బ్యాంకు పిలిపించారు. 'మీరు బ్యాంకులో దాచుకున్న బంగారం చోరీకి గురైంది.. ఈ కేసు కోర్టులో ఉంది. ప్రస్తుతం తులం బంగారానికి రూ.77,710 అందిస్తాం' అని చెప్పారు. దీంతో బాధితులు ససేమిరా అన్నారు. ప్రస్తుతం తులం బంగారం రూ. 87వేలు ఉందని, మేం పదితులాలకు తులం బంగారం తరుగు కోల్పోవాలా అంటూ నిలదీశారు. చోరీకి గురైన బంగారం ఇవ్వండి.. లేదా ప్రస్తుతం గోల్డ్‌కు ఉన్న ధర ప్రకారం డబ్బు ఇవ్వాలని, తరుగు తీయొద్దని డిమాండ్‌ చేశారు. దీంతో చేసేదేమీలేకపోవడంతో బ్యాంకు అధికారులు మరో వారం రోజుల తర్వాత రావాలని చెప్పడంతో బాధితులు వెనుదిరిగారు. కాగా, బ్యాంకులో భరోసా ఉంటుందని దాచుకుంటే అధికారుల నిర్లక్ష్యం వల్లే బంగారం చోరీకి గురైందని బాధితులు ఆరోపించారు. బ్యాంకుకు సెక్యూరిటీని నియమించకపోవడంతోనే చోరీ జరిగిందని మండిపడ్డారు. పరిహారం చెల్లించాలని నాలుగు నెలల నుంచి బ్యాంకు చుట్టు ప్రదక్షణలు చేస్తున్నా అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు.

### తులానికి గ్రాము తీసేస్తే ఎట్లా..



తులం బంగారానికి గ్రాము తరుగు తీసేసి డబ్బులు చెల్లిస్తామంటున్నారు. మాది మధ్యతరగతి కుటుంబం. మూడు తులాల తాడు చేయించుకోవాలంటే ఎంతో ఇబ్బంది. వాళ్ల డబ్బులు కట్టిస్తే ఎదో అప్పుకింద పోతుంది. ఆడపిల్లలకోసం బంగారు ఆభరణాలు చేయించుకున్నం. బ్యాంకుకు ఎంత వడ్డీ అయ్యిందో చెల్లిస్తాం. మా బంగారం మాకు ఇవ్వాలి.

-కోల హైమ, మైలారం

### తరుగు తీసి డబ్బులు కట్టిస్తామంటున్నారు



అధికారుల నిర్లక్ష్యంతోనే బ్యాంకులో చోరీ జరిగింది. బంగారం పోయిన రోజు గుర్తుకూడా పోకుండా ఇస్తామని బాధితులకు చెప్పిన బ్యాంకు అధికారులు.. ఇప్పుడు బంగారంలో తరుగు తీసి డబ్బులు కట్టిస్తామంటున్నారు. పది తులాల బంగారానికి తులం లాస్‌ అవుతున్నాం. ఎంత మిత్తి అయ్యిందో అంత చెల్లిస్తం. మా బంగారం మాకు ఇప్పించాలి.

-పగిడిపల్లి భీంరెడ్డి, మైలారం

## నాణ్యతాప్రమాణాలు లేని పాలు

- టెస్ట్‌ చెక్‌లో గుర్తించినట్లు వెల్లడి


పాల నాణ్యత చెక్‌ చేస్తున్న అధికారులు

**వరంగల్‌:** వరంగల్‌ పోచమ్మ మైదాన్‌లో హనుమకొండ విజయ డెయిరీలో 'పాల నాణ్యత'పై బుధవారం టెస్ట్‌ చెక్‌ నిర్వహించగా ప్యాకెట్లపై పేర్కొన్న విధంగా ప్రమాణాలు లేవని వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచర్ల సుదర్శన్‌ తెలిపారు. వినియోగదారుల మండలి సేకరించిన (19) ప్రైవేట్‌ డెయిరీల పాల నాణ్యతాపరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. పాల ప్యాకెట్‌లపై ముద్రించిన ప్రకారం వెన్న శాతం, పాలు ఎక్కువ రోజులు నిల్వ ఉండడానికి కలిపే హైడ్రోజన్‌ పెరాక్సైడ్‌, కాస్టిక్‌ సోడాలకు సంబంధించిన నాణ్యతా పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. విజయ డెయిరీ పోలికతో ఉన్న ప్రైవేట్‌ డెయిరీ పాలలో కాస్టిక్‌ సోడా కలిపినట్లు తేలిందన్నారు. అలాగే, ఆరు ప్రైవేట్‌ డెయిరీలు తమ ప్యాకెట్‌లపై ముద్రించిన ప్రకారం వెన్న శాతం పాలలో లేదని నిర్ధారణ అయ్యిందన్నారు. ఫుడ్‌ సేఫ్టీ ఆఫీసర్‌ మౌనిక, విజయ డెయిరీ డీడీ శ్రవణ్‌కుమార్‌, మేనేజర్‌ ప్రదీప్‌ ఆధ్వర్యంలో పాల నాణ్యతా పరీక్షలు జరిగాయి. కార్యక్రమంలో మండలి రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు రావుల రంజిత్‌ కుమార్‌, నల్లా రాజేందర్‌, చిలువేరు ప్రవీణ్‌, నగర కార్యదర్శి బేతి రాజేశ్‌ పాల్గొన్నారు.

## పెళ్లింట తీవ్ర విషాదం..

- కొడుకు పెళ్లైన రెండో రోజే బ్రెయిన్‌ స్ట్రోక్‌తో తండ్రి మృతి
- సుందరయ్య కాలనీ గ్రామంలో ఘటన


ఏసుబాబు(ఫైల్‌)


పెళ్లి సమయంలో కొడుకును ఆశీర్వదిస్తున్న తల్లిదండ్రులు

**వాజేడు :** బంధువులు, అతిథుల మధ్య అంగరంగ వైభవంగా కొడుకు పెళ్లి జరిపించాడు. పెళ్లింటి నుంచి సొంతింటికి వచ్చి వ్రతం చేసుకుంటున్నారు. అంతలోనే బంధువులతో కళకళలాడుతున్న ఆ ఇంట తీవ్ర విషాదం చోటు చేసుకుంది. బ్రెయిన్‌ స్ట్రోక్‌తో పెళ్లి కొడుకు తండ్రి మృతి చెందాడు. ఈ ఘటనతో బంధువులు, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. కుటుంబ సభ్యులు, బంధువుల కథనం ప్రకారం.. ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని సుందరయ్య కాలనీ గ్రామానికి చెందిన అక్కిసెట్టి ఏసుబాబు(48)కి భార్య కుమారి, ఇద్దరు కుమారులు హరికృష్ణ, శివ కృష్ణ ఉన్నారు. పెద్ద కొడుకు హరికృష్ణకు భద్రాద్రి కొత్త గూడెం జిల్లాలోని సత్యనారాయణపురం గ్రామానికి చెందిన యువతితో సోమవారం(మార్చి 3) పెళ్లి జరిపించాడు. అనంతరం వధూవరులను తీసుకుని తమ ఇంటికి వచ్చాడు. మంగళవారం సత్యనారాయణ స్వామి వ్రతం జరిపిస్తున్నాడు. అదే సమయంలో తనకు అలసటగా ఉందని, వ్రతంలో కూర్చో లేనని కుటుంబ సభ్యులకు తెలిపాడు. కొత్త జంటతోపాటు వరుడి తల్లి వ్రతంలో కూర్చున్నారు. ఈ క్రమంలో ఏసుబాబు కాళ్లు, చేతులు లాక్కురావడం చూసిన బంధువులు వెంటనే ఆర్‌ఎంపీతో పరీక్షించగా బీపీ పెరిగినట్లు తెలిపి వెంటనే మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రికి తరలించాలని చెప్పాడు. దీంతో ఏటూరు నాగారం తీసుకు వెళ్లగా పరిస్థితి ప్రమాదకరంగా ఉందని వరంగల్‌ తీసుకెళ్లాలని అక్కడి ప్రైవేట్‌ వైద్యుడు తెలుపగా వెంటనే వరంగల్‌ ఎంజీఎం తరలించారు. వైద్యం చేస్తుండగా బుధవారం మృతి చెందాడు. దీంతో కుటుంబీకులు, బంధువులు బోరున విలపించారు.

# ఇస్రో పిలుస్తోంది.. వెళ్దాం రండి

**తొమ్మిదో తరగతి విద్యార్థులకు అవకాశం**

- యువికా కార్యక్రమానికి 23వ తేదీ వరకు గడువు
- 7 కేంద్రాల్లో నిర్వహణ
- ప్రయాణం, వసతి సౌకర్యాలు ఉచితం



**మహబూబాబాద్‌ అర్బన్‌ :** అంతరిక్ష విజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఏటా యువ విజ్ఞాన కార్యక్రమం(యువికా) నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఈ ఏడాది చేపట్టబోయే కార్యక్రమం కోసం దేశవ్యాప్తంగా తొమ్మిదో తరగతి విద్యార్థులను ఆహ్వానిస్తోంది. ఆ వివరాలు ఏమిటో ఒకసారి తెలుసుకుందాం.. అంతరిక్ష పరిశోధనల్లో ఇటీవల ఇస్రో వంద ప్రయోగాలు పూర్తి చేసుకుంది. అగ్రదేశాలకు దీటుగా భారత్‌ పరిశోధనలు చేపడుతోంది. ఈ విజ్ఞానాన్ని విద్యార్థులకు తెలియజేసేందుకు, వారిలో స్ఫూర్తి నింపేందుకు ఇస్రో ఈ కార్యక్రమం చేపడుతోంది.

**23వ తేదీ వరకు గడువు..**

విద్యార్థులు మార్చి 23వ తేదీలోగా www.isro.gov.in లో దరఖాస్తు చేసుకోవచ్చు. వచ్చిన దరఖాస్తుల వడపోత అనంతరం ఏప్రిల్‌ 7న ఎంపికైన విద్యార్థుల జాబితా విడుదల చేస్తారు. మే 18 నుంచి విద్యార్థులను ఆహ్వానిస్తారు. మే 19 నుంచి 30 వరకు యువికా- 25 కార్యక్రమం నిర్వహిస్తారు. మే 31న ముగింపు సందర్భంగా కార్యక్రమంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తారు.

**7 కేంద్రాల్లో నిర్వహణ..**

ఇస్రో ఈ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా ఏడు కేంద్రాల్లో చేపడుతోంది. డెహ్రాడూన్‌(ఉత్తరాఖండ్‌), తిరువనంతపురం (కేరళ), సూళ్లూరుపేట (ఏపీ), బెంగళూరు (కర్ణాటక), అహ్మదాబాద్‌(గుజరాత్‌), హైదరాబాద్‌(తెలంగాణ), షిల్లాంగ్‌(మేఘాలయ).

**అన్నీ ఉచితంగానే..**

ఇస్రో నిర్వహించే యువికా కార్యక్రమానికి ఎంపికైన విద్యార్థులకు ప్రయాణం, భోజన, వసతి సౌకర్యాలు ఇస్రో ఉచితంగా అందజేస్తుంది. ఎంపికైన విద్యార్థులను మే నెలలో 14 రోజులపాటు ఇస్రోకు చెందిన స్పేస్‌ సెంటర్లకు తీసుకెళ్తారు. అక్కడ సైన్స్‌కు సంబంధించిన వింతలు, విశేషాలు, సప్తగ్రహ కూటమి తదితర అంశాలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తారు. శాస్త్రవేత్తలతో మాట్లాడే అవకాశం విద్యార్థులకు కల్పిస్తారు.

**ఎవరు అర్హులు..**

ప్రభుత్వ, ప్రైవేట్‌ పాఠశాలలకు చెందిన తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. 8వ తరగతిలో సాధించిన మార్కులకు 50 శాతం వెయిటేజీ ఇస్తారు. స్పేస్‌, సైన్స్‌ క్లబ్‌లో ఉంటే 5 శాతం, జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ చూపితే 10 శాతం, ఎన్‌సీసీ, స్కౌట్స్‌ అండ్‌ గైడ్స్‌ విభాగాల్లో ఉంటే 5 శాతం, పల్లె ప్రాంతాలకు చెందిన వారికి 20 శాతం ప్రాధాన్యం కల్పిస్తారు.

## నకిలీ పురుగు మందులు విక్రయిస్తున్న ముఠా అరెస్ట్‌

- రూ.34 లక్షల విలువైన మందులు, రెండు కార్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీపీ అంబర్‌ కిశోర్‌ ఝా


నిందితుల అరెస్ట్‌ చూపుతున్న సీపీ అంబర్‌ కిశోర్‌ ఝా, పోలీసు అధికారులు

**రామన్నపేట :** అన్నదాతలను మోసం చేస్తూ నకిలీ పురుగు మందులు విక్రయిస్తున్న ఐదుగురు సభ్యుల ముఠాను వరంగల్‌ పోలీస్‌ కమిషనరేట్‌ పరిధి టాస్క్‌ఫోర్స్‌, మట్టెవాడ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్‌ చేసినట్లు వరంగల్‌ పోలీస్‌ కమిషనర్‌ అంబర్‌ కిశోర్‌ ఝా తెలిపారు. వీరి నుంచి సుమారు రూ.34 లక్షల విలువైన వివిధ కంపెనీల పేర్లతో ఉన్న నకిలీ పురుగు మందులు, రెండు కార్లు, ఐదు సెల్‌ఫోన్లు, నకిలీ పురుగు మందు లేబుళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు బుధవారం వరంగల్‌ పోలీసు కమిషనరేట్‌ కార్యాయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రెండు రోజుల క్రితం టాస్క్‌ఫోర్స్‌, మట్టెవాడ పోలీసులు సంయుక్తంగా వరంగల్‌ గోపాలస్వామి గుడి ప్రాంతంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ కారు అనుమానాస్పదంగా కనిపించింది. దీంతో తనిఖీ చేయగా పురుగు మందుల డబ్బాలు కనిపించాయి. కారులో ఉన్న నిందితుల్లో ఒకరైన కర్ణాటకలోని బళ్లారి జిల్లా కురుగోడుకు చెందిన నిందితుడు కాత్రగౌడ భాస్కర్‌ రెడ్డిని అదుపులోకి తీసుకుని విచారించగా నకిలీ పురుగు మందులను విక్రయిస్తున్నట్లు అంగీకరించడంతో మట్టెవాడ పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం విచారణలో భాగంగా మంగళవారం నిందితుడు కాత్రగౌడ భాస్కర్‌ రెడ్డి సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్‌, మట్టెవాడ పోలీసులు సంయుక్తంగా హైదరాబాద్‌ చర్లపల్లి ప్రాంతంలోని గోడౌన్‌పై దాడి చేసి మిగతా నలుగురు నిందితులు హైదరాబాద్‌ కుషాయిగూకు చెందిన పిల్ల నాగవెంకటరంగారావు, లక్డీకాపూల్‌కు చెందిన ముద్దంగుల ఆదిత్య, దూదిమెట్లకు చెందిన పిట్ల నవీన్‌, మిర్యాలగూడ ఇందిరమ్మకాలనీకి చెందిన దూదిమెట్ల శ్రీధర్‌ను విచారించారు. డిమాండ్‌ ఉన్న కంపెనీ పేర్లతో నకిలీ పురుగు, గడ్డి మందులు తయారీ చేసి విక్రయించి రైతులను మోసం చేసున్నట్లు అంగీకరించారు. దీంతో నిందితులను అరెస్ట్‌ చేసి బేయర్‌, టాటా, కోర్టెవాతోపాటు మరో నాలుగు కంపెనీల పేర్లతో ఉన్న నకిలీ పురుగు మందులు, గడ్డి మందులు స్వాధీనం చేసుకున్నట్లు సీపీ తెలిపారు. కాగా, నిందితులను పట్టుకోవడం ప్రతిభ కనబరిచిన సెంట్రల్‌ జోన్‌ డీసీపీ షేక్‌ సలీమా, టాస్క్‌ఫోర్‌, వరంగల్‌ ఏసీపీలు మధుసూదన్‌, నందిరాంనాయక్‌, టాస్క్‌ఫోర్‌, మట్టెవాడ ఇన్‌స్పెక్టర్లు సార్ల రాజు, గోపి, ఎస్సైలు ఓరుగంటి భానుప్రకాశ్‌, లచ్చయ్య, సాంబయ్య, ఏఏఓ సల్మాన్‌ పాషా, కానిస్టేబుళ్లు సురేశ్‌, సాంబరాజు, సురేందర్‌, రమేశ్‌ను సీపీ అభినందించారు.

## నలుగురు మావోయిస్టు కొరియర్ల అరెస్ట్‌

- వివరాలు వెల్లడించిన ఏఎస్పీ శివం ఉపాధ్యాయ


వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ

**ఏటూరునాగారం/వెంకటాపురం(కె):** నలుగురు మావోయిస్టు కొరియర్లను అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ తెలిపారు. ఈమేరకు బుధవారం ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఏఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈనెల 3వ తేదీన ఛత్తీస్‌గఢ్‌ బార్డర్‌ దాటి వెంకటాపురం(కె) మండలం కొత్తపల్లి వద్ద ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు మావోయిస్టు కొరియర్లు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన బాడిసె అనిల్‌, కుర్హామి భామన్‌, మడవి సుక్కు, సోడి ఇడుమాల్‌.. పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకున్నారు. అనిల్‌, భామన్‌, సుక్కు, ఇడుమాల్‌.. ఈనెల 2వ తేదీన మావోయిస్టుల వద్ద డబ్బులు తీసుకుని 3వ తేదీన చర్ల ప్రాంతంలో దుస్తులు, ఎలక్ట్రానిక్‌ వస్తువులు, మొబైల్‌ చార్జర్లు, బూట్లు, నిత్యావసర వస్తువులు కొనుగోలు చేసి మావోయిస్టులకు ఇవ్వడానికి వెళ్లే క్రమంలో 4వ తేదీన విజయపురికాలనీ(కొత్తపల్లి) వద్ద పోలీసులకు పట్టుబడ్డారు. దీంతో నలుగురిని అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ తెలిపారు. ఏజెన్సీ ప్రజలు నిషేధిత మావోయిస్టు పార్టీకి సహకరించొద్దని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ హెచ్చరించారు.

## షేర్‌ హోల్డర్స్‌కు ఫెస్టివల్‌ లోన్‌

- హోలీ,ఉగాది, రంజాన్‌ పండుగలకు రూ. లక్ష మంజూరు

**కాజీపేట రూరల్‌ :** దక్షిణ మధ్య రైల్వే రైల్వే ఎంప్లాయిస్‌ కో-ఆపరేటివ్‌ క్రెడిట్‌ సొసైటీ (ఈసీసీఎస్‌) లిమిటెడ్‌.. హోలీ, ఉగాది, రంజాన్‌ పండుగల సందర్భంగా రైల్వే సీసీఎస్‌ షేర్‌ హోల్డర్స్‌(సభ్యులు)కు రుణాల మంజూరు ప్రకటించిందని కాజీపేట రైల్వే సీసీఎస్‌ డైరెక్టర్‌ డి.శ్రీనివాస్‌ యాదవ్‌, కోఆప్షన్‌ డైరెక్టర్‌ దేవులపల్లి రాఘవేందర్‌ బుధవారం తెలిపారు. సౌత్‌ సెంట్రల్‌ రైల్వే ఎంప్లాయిస్‌ కో-ఆపరేటివ్‌ క్రెడిట్‌ సొసైటీ ప్రెసిడెంట్‌ చిలుకు స్వామి, వైస్‌ ప్రెసిడెంట్‌ రామ్మోహన్‌ నేతృత్వంలో సీసీఎస్‌ సభ్యులకు ఫెస్టివల్‌ లోన్‌ ఇచ్చేందుకు బోర్డు నిర్ణయించినట్లు తెలిపారు. అర్హులైన రైల్వే సీసీఎస్‌ సభ్యులు ఈ ఫెస్టివల్‌ లోన్‌కు ఈ నెల 6వ నుంచి 14వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫెస్టివల్‌ లోన్‌గా సీసీఎస్‌ సభ్యులకు రూ. లక్ష మంజూరు చేయనున్నట్లు వారు తెలిపారు.

## ఆర్టీసీ బస్సుకు తప్పిన పెను ప్రమాదం


బోల్టు విరిగి ఊడిన చక్రం

**వెంకటాపురం(కె):** మండలంలోని పాత్రాపురం గ్రామ సమీపంలో బుధవారం ఆర్టీసీ బస్సుకు త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. ఆర్టీసీ బస్సు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం నుంచి వెంకటాపురం మండల కేంద్రానికి వస్తోంది. ఈ క్రమంలో పాత్రాపురం గ్రామ సమీపంలోకి వచ్చే సమయానికి బస్సు వెనుక చక్రం బోల్టు విరిగి ఊడింది. దీంతో బస్సు రోడ్డు మీద నుంచి పక్కకు వెళ్తుండగా డ్రైవర్‌ చాకచక్యంగా వ్యవహరించి అదుపులోకి తీసుకొచ్చాడు. దీంతో బస్సులో ఉన్న సుమారు 50 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు.

## డీఎన్‌ఏ.. వ్యక్తిగత జీవితానికి ఆధారం

- కేయూ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి


మాట్లాడుతున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

**కేయూ క్యాంపస్‌:** డీఎన్‌ఏ.. వ్యక్తిగత జీవితానికి ఆధారమని కాకతీయ యూనివర్సిటీ వీసీ కె.ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం కేయూలోని జూవాలజీ విభాగం ఆధ్వర్యంలో 'యూసెస్‌ ఆఫ్‌ రీకాంబినెంట్‌ డీఎన్‌ఏ టెక్నాలజీ ఇన్‌ హెల్త్‌' అనే అంశంపై రెండు రోజుల వర్క్‌షాప్‌ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌ ప్రారంభ సభలో వీసీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. చిన్న మాలిక్యూల్‌ వ్యక్తి జీవితాన్ని మాత్రమే కాదు దేశాల ఆర్థిక వ్యవస్థను కూడా మార్చుతుందన్నారు. వ్యాధుల నివారణ, చికిత్సల్లో అపరిమితమైన ఆవశ్యకత ఉందన్నారు. కోవిడ్‌-19 సమయంలో డీఎన్‌ఏ ప్రధాన భూమిక వహించిందన్నారు. రోగ నిరోధక వ్యవస్థ , యాంటీబాడీల అభివృద్ధిలో కరోనా సమయంలో వ్యాక్సిన్‌ల ప్రాధాన్యతను గుర్తుచేశారు. భారతదేశం వ్యాక్సిన్ల హబ్‌గా నిలిచిందన్నారు. పబ్లిక్‌హెల్త్‌లో వ్యాక్సిన్లు కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. దేశీయంగా వ్యాక్సిన్ల ఉత్పత్తితో వ్యయం తగ్గుతుందన్నారు. ఆ దిశగానే పరిశోధనలు కొనసాగించాలన్నారు. సమావేశంలో జూవాలజీ విభాగం అధిపతి ప్రొఫెసర్‌ జి. షమిత, సైన్స్‌ విభాగాల డీన్‌ జి. హనుమంతు, ఆచార్యులు మామిడాల ఇస్తారి, వై. వెంకయ్య, ఈసం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## 121 డిగ్రీ కళాశాలల ఫలితాలు నిలిపివేత

- కేయూ డీన్‌ అకడమిక్‌కు ఫీజులు చెల్లించని ప్రైవేట్‌ డిగ్రీ కళాశాలలు
- నోటీసులకు యాజమాన్యాల నో రెస్పాన్స్‌

**కేయూ క్యాంపస్‌:** కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్‌, ఖమ్మం, ఆదిలాబాద్‌ జిల్లాల్లోని డిగ్రీ కోర్సుల బీఏ, బీకాం, బీబీఏ బీఎస్సీ, బీసీఏ బీ ఒకేషనల్‌ కోర్సులకు సంబంధించి మొదటి, మూడవ, ఐదవ సెమిస్టర్ల పరీక్ష ఫలితాలను ఈ నెల 4న రాత్రి విడుదల చేసిన విషయం తెలిసిందే. కానీ డీన్‌ అకడమిక్‌కు ఫీజులు చెల్లించకపోవడంతో ఆయా కళాశాలల పరీక్షల ఫలితాలను , యూనివర్సిటీ పరీక్షల విభాగం అధికారులు నిలిపివేశారు. యూనివర్సిటీ పరిధిలో 304 (ప్రభుత్వ, ప్రైవేట్‌, ఎయిడెడ్‌ గురుకుల) కళాశాలలు ఉన్నాయి. అందులో 121 ప్రైవేట్‌ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు యూనివర్సిటీ డీన్‌ అకడమిక్‌కు వివిధ రకాల ఫీజులు చెల్లించాల్సింటుంది. కానీ, ఫీజులు చెల్లించకపోవడంతో వాటి ఫలితాలను యూనివర్సిటీ పరీక్షల విభాగం అధికారులు నిలిపివేశారు. దీంతో విద్యార్థులకు ఫలితాలు తెలియక ఆందోళన చెందుతున్నారు. కొన్ని కాలేజీలకు వచ్చి మరికొన్నింటికి రాకపోవడేమంటని ఆరా తీస్తున్నారు.

**ఇప్పటికే సమయమిచ్చిన వర్సిటీ అధికారులు**

కాకతీయ యూనివర్సిటీ డీన్‌ అకడమిక్‌కు ప్రైవేట్‌ డిగ్రీ కళాశాలలు రిజిస్ట్రేషన్‌ ఫీజు, ప్రాసెసింగ్‌, స్టూడెంట్‌ రికగ్నిషన్‌ ఫీజు, స్టూడెంట్‌ వెల్ఫేర్‌ ఫండ్‌, ఇంటర్‌ యూనివర్సిటీ టోర్నమెంట్‌ ఫీజు కలిపి చెల్లించాల్సింటుంది. విద్యార్థుల సంఖ్యను బట్టి ఆయా ఫీజులు కట్టాల్సి ఉంటుంది. విద్యార్థులు ఎక్కువమంది ఉన్న కళాశాలలు రూ.లక్షల్లోనే చెల్లించాల్సింటుంది. డిగ్రీకోర్సుల మొదటి, మూడవ, ఐదవ సెమిస్టర్‌ పరీక్షలు గత ఏడాది డిసెంబర్‌లో మొదలయ్యే సమయంలో ఆయా ఫీజులు చెల్లించాల్సిండగా, అప్పట్లో ప్రైవేట్‌ డిగ్రీ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్‌ల బాధ్యులు కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డిని, అప్పటి రిజిస్ట్రార్‌ మల్లారెడ్డిని కలిశారు. తమ కళాశాలలకు ప్రభుత్వం రెండుమూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్‌ ఇవ్వడంలేదని, ఆర్థిక ఇబ్బందులున్నాయని, ఫీజులు చెల్లించేందుకు కొంత సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. ఇందుకు తొలుత అంగీకరించకపోయినా ఆ తర్వాత తప్పని పరిస్థితుల్లో వీసీ, రిజిస్ట్రార్‌ అంగీకరించారు. 15 నుంచి 20 రోజుల వరకు సమయం ఇచ్చారు. పరీక్షలు పూర్తయ్యాక కూడా కొద్దిరోజుల క్రితం జవాబుపత్రాల మూల్యాంకనం పూర్తికావొచ్చినప్పుడు యూనివర్సిటీ అకడమిక్‌ డీన్‌ ఆయా కళాశాలలకు ఫీజులు చెల్లించాలని నోటీస్‌లు పంపారు. కొన్నికళాశాలల యాజమాన్యాలు చెల్లించగా, 121 ప్రైవేట్‌ కళాశాలలు బుధవారం వరకు ఫీజులు చెల్లించలేదు. ఫీజులు చెల్లించిన వాటి ఫలితాలు వెబ్‌సైట్‌ ఉంచి, చెల్లించని వారివి నిలిపివేశారు.

### ఆందోళన చెందుతున్న విద్యార్థులు

తమ ఫలితాలు చూసుకునే వీలులేకపోవడంతో ఆయా కళాశాలల విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. కళాశాలలకు వెళ్లి ఫలితాలు కనిపించడం లేదని ప్రశ్నించినట్లు సమాచారం . కాగా, తెలంగాణ ప్రభుత్వ డిగ్రీ ప్రైవేట్‌ కళాశాలల యాజామాన్యాల అసోసియేషన్‌ బాధ్యులు బుధవారం రిజిస్ట్రార్‌ రామచంద్రాన్ని కలిసి.. ఫలితాలు వెల్లడించాలని విన్నవించారు. తాను వీసీ దృష్టికి తీసుకెళ్లాక నిర్ణయం తీసుకుంటామని ఆయన తెలిపారని సమాచారం.

### ఫీజులు చెల్లిస్తేనే ఫలితాలు

కాకతీయ యూనివర్సిటీ డీన్‌ అకడమిక్‌కు ఫీజులు చెల్లించినట్లు క్లియరెన్స్‌ వస్తేనే ఫలితాలు వెల్లడిస్తాం. ఫీజులు చెల్లించకపోతే ఫలితాలను వెల్లడించే ప్రసక్తి లేదు.

ప్రొఫెసర్‌ రాజేందర్‌,
పరీక్షల నియంత్రణాధికారి, కేయూ